

సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, హాజరైన మహిళలు

# సీఎం కేసీఆర్‌ను మళ్లీ గెలిపించాలి

ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్, అక్టోబర్ 3 : గజ్వేల్ నుంచి మూడో సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, అప్పుడే గజ్వేల్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని వైశ్య భవనంలో జరిగిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాకతోనే గజ్వేల్‌కు జిల్లా దవాఖాన వచ్చిందన్నారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలోనే గజ్వేల గౌరవాన్ని, ప్రతిష్టను పెంచారన్నారు. సీఎం కేసీఆర్‌లోనే గజ్వేల్ రూపురేఖలు మారాయన్నారు. మొన్నటి దాక గజ్వేల్‌కు గూడ్స్ రైలు వచ్చిందని, ఇవాళ్టి నుంచి ప్యాసింజర్ రైలు రావడం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే వెయ్యి కోట్లు వెచ్చించి సిద్దిపేట జిల్లాకు రైలు తెచ్చుకున్నామన్నారు. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీలో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు ఇంతటి అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌ను మరిచిపోవద్దన్నారు. గత ప్రభుత్వాల హయాంలో చూసిన గజ్వేల్‌కు ఇప్పటి గజ్వేల్‌కు ఎంతో తేడా ఉందో కళ్ల ముందే అభివృద్ధి కనిపిస్తుందని చెప్పారు. అంతకుముందు మంత్రికి మహిళలు కోలాటం ఆడుతూ.. పూలు చల్లుతూ స్వాగతం పలికారు. అనంతరం సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం చేసిన పత్రాన్ని మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



వెంకటయ్యను శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

## ఎమ్మెల్సీ కవితను కలిసిన బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, అక్టోబర్ 3 : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్యను ఆమె శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు, శంకర్, జాతీయ మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## భవనం పైనుంచి దూకిన విద్యార్థిని

మిరుదొడ్డి, అక్టోబర్ 3 : పాఠశాల భవనం పైనుంచి విద్యార్థిని దూకి గాయాల పాలైన ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో మంగళవారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి కస్తూర్బాగాంధీ పాఠశాల ఎస్‌వో స్వర్ణలత వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నిజాంపేట మండలం తిప్పనగుల్ల గ్రామానికి చెందిన శ్యామల-సహదేవ్ దంపతుల కుమార్తె రక్షిత మిరుదొడ్డిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. కొన్ని రోజులుగా రక్షిత పాఠశాలలో పిచ్చిపిచ్చిగా వ్యవహరించడంతో టీచర్లు విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ కూతురును ఇంటికి తీసుకెళ్లాలని చెప్పారు. రక్షిత తల్లిదండ్రులు పరీక్షలు అయ్యేంతవరకు పాఠశాలలో ఉంచుకోవాలని విజ్ఞప్తి చేయడంతో చదువు దృష్ట్యా అక్కడే ఉంచుకోవడం జరిగింది. మంగళవారం ఉదయం 3వ పిరియడ్‌లో తన గదిలో ఉన్న నోట్ బుక్స్ తీసుకొస్తానని రక్షిత టీచర్‌కు చెప్పి క్లాస్‌రూమ్ నుంచి వెళ్లి పాఠశాల బిల్డింగ్ ఒకటో అంతస్తు పైనుంచి దూకింది. ఇది గమనించిన టీచర్లు వెంటనే రక్షితను సిద్దిపేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్‌వో తెలిపారు.

## దుబ్బాకలో గణేశ్ నిమజ్జనం

దుబ్బాక టౌన్, అక్టోబర్ 3 : దుబ్బాకలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గత 15 రోజులుగా పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరారు. సోమవారం రాత్రి నుంచి ఊరేగింపు ప్రారంభమై మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక పెద్ద చెరువులో గణేశులను నిమజ్జనం చేశారు. గణేశుల ఊరేగింపులో యువకులు, చిన్నారులు పాల్గొని నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ కృష్ణ, ఎస్సై గంగరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



గణేశ్ విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

## దుద్దెడలో మంత్రి హరీశ్‌రావుకు ఘనస్వాగతం

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 3 : సిద్దిపేట జిల్లా ప్రజల దశాబ్దాల కోరిక నెరవేరింది. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషి ఫలితంగా మంగళవారం రైలు సిద్దిపేటకు చేరుకుంది. మొట్ట మొదటిసారి సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు రైలు ప్రయాణ సేవలను ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అదే రైలులో ఎక్కి దుద్దెడ రైల్వే స్టేషన్‌లో దిగిన మంత్రి హరీశ్‌రావుకు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. జై కేసీఆర్, జై హరీశ్‌రావు అంటూ నినాదాలు చేశారు. అనంతరం దుద్దెడలో రూ.20 లక్షలతో నిర్మించిన ఆదర్శ యూత్ అసోసియేషన్ భవనాన్ని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, ఎంపీపీ ర్యాగల్ల సుగుణాదుర్గయ్య, జడ్పీటీసీ అనంతుల అశ్విని‌ప్రశాంత్, ఎంపీటీసీ బాలాజీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కుమార్‌యాదవ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు ఎల్లం యాదవ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



దుద్దెడ రైల్వేస్టేషన్‌లో దిగిన మంత్రి హరీశ్‌రావుకు ఘనస్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

# సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలి
- బీఆర్ఎస్‌తోనే కరువు దూరమైంది
- రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, అక్టోబర్ 3 : వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రజలను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో 432 మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మిమోసపోవద్దన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం ఘనణీయంగా అభివృద్ధి సాధించిందన్నారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో' అనే నినాదంతో సీఎం కేసీఆర్ యావత్ తెలంగాణ ప్రజలను ఏకతాటిపై తెచ్చి ఉద్యమాన్ని నడిపి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఆడబిడ్డల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు. ఆడబిడ్డల క్షేమం కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం, అంబులెన్స్ సౌకర్యం కల్పించి ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం, కేసీఆర్ కిట్టు అందజేస్తున్నామని చెప్పారు. కన్నతల్లి మాదిరిగా ఆడబిడ్డలను ప్రభుత్వం కడుపులో పెట్టుకొని సాదుకుంటుందన్నారు. మెట్ట ప్రాంతమైన బెజ్జంకికి కాళేశ్వరం జలాలను తీసుకొచ్చి వందలాది ఎకరాలను పచ్చని పంటలతో సస్యశామలంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రాజెక్ట్ నిర్మాణాలు, రైతుబంధు, దురదృష్టవశాత్తు రైతు మరణిస్తే రూ.5 లక్షల బీమాను ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు. గతంలో బెజ్జంకి అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేదని, నేడు ఎక్కడ చూసినా అభివృద్ధి పనులే దర్శనమిస్తున్నాయని చెప్పారు. నీళ్ల గోసన తీర్చి ఆడబిడ్డలకు బాధతీర్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందరూ అండగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బేగంపేట గ్రామం లో నిర్మించిన షాపింగ్‌కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జడ్పీటీసీ కనగండ్ల కవిత, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రకళ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచులు మం జుల, సంజీవరెడ్డి, ఎంపీటీసీ శారద, ఎంపీడీవో రాము, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే గజ్వేల్‌కు రైలు

మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 3 : సీఎం కేసీఆర్‌తోనే గజ్వేల్‌కు రైలు వచ్చిందని గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అన్నారు. మంగళవారం సిద్దిపేట నుంచి ప్రారంభమైన రైలు గజ్వేల్‌కు చేరుకోగానే మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, జడ్పీటీసీ మల్లేశం, కౌన్సిలర్లు రజిత, బాలమణిశ్రీనివాస్, చందు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. జై కేసీఆర్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రైలుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చొరవతో గజ్వేల్ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. రైళ్ల రాకతో గజ్వేల్ వ్యాపార, వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలంతా రుణపడి ఉంటారని తెలిపారు.



గజ్వేల్‌లో రైలు ఎక్కిన మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, జడ్పీటీసీ మల్లేశం బీఆర్ఎస్ నాయకులు



రిశేంద్రను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు రిశేంద్ర ఎంపిక

హుస్నాబాద్, అక్టోబర్ 3 : హుస్నాబాద్‌లోని సీవీ రామన్ హైస్కూల్‌కు చెందిన బంటు రిశేంద్ర ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన అండర్-14 విభాగంలో బాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి రిశేంద్రను ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, పీఈటీ మహేశ్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తిని పెంచి శిక్షణ ఇస్తున్నామన్నారు.